
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
ఆదివారం 14 ఏప్రిల్ 2024



కేడర్‌లో.. లోకల్ జోష్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

పార్లమెంట్ పోరు ముగియగానే స్థానిక సంస్థల పోరుకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలోనే సర్పంచుల పదవీకాలం పూర్తి కాగా, జూన్, జులై నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో స్థానిక ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావహుల్లో జోష్ నింపింది. ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తల పనితీరు ప్రతిపాదికన పోటీకి అవకాశం ఇస్తామని తమ పార్టీ కేడర్‌కు సీఎం భరోసానిచ్చారు. మరోవైపు ప్రతిపక్షాల్లోనూ ఈ ప్రకటన జోష్ నింపతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,567 మందికి సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవులు రానుండటంతో పాటు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు కూడా కేడర్‌ను ఊరిస్తున్నాయి.

జులైలో స్థానిక సమరం

పార్లమెంట్ ఎన్నికల్లో తమ నేతల విజయాల కోసం మండుటెండలో శ్రమిస్తున్న కేడర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చల్లని కబురు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేశారు. మే 13న తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుండగా జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం చేసిన ప్రకటన ప్రకారం జులైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందనే అభిప్రాయాలున్నాయి. అయితే ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరి 1వ తేదీన పదవీకాలం ముగిసింది. అయితే బీసీ జనాభా లెక్కలు తేలకపోవటంతో పాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారు. గ్రామ పంచాయతీలకు పర్సన్ ఇంచార్జ్‌లుగా అధికారులను ప్రభుత్వం నియమించింది. జూలై నెల మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కానుంది. దీంతో సర్పంచ్ స్థానాలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూడా జూలై, ఆగస్టుల్లో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688 గ్రామ పంచా యతీలు ఉండగా, కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిపి 74 జడ్పీటీసీ పదవులకు, 805 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,567 మందిని పదవులు వరించనున్నాయి. ఇటీవల కొత్తగా భూపాలపల్లిలో గోరికొత్తపల్లి, మహబూబాబాద్ జిల్లాలో ఇనుగుర్తి, సిరోలు మండలాలు ఏర్పడ్డాయి. వీటిలో కొత్తగా

లోక్‌సభ పోరు తరువాత స్థానిక సమరం

మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) స్థానాలను పెంచే అవకాశం ఉంది. ఎంపీటీసీల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే 2009 నుంచి ములుగు జిల్లా మంగపేట మండలంలో 115 ఎంపీటీసీ స్థానాలకు, 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు లేవు. ఈసారి వీటికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వచ్చే జనవరి మునిసిపాలిటీల పదవీ కాలం పూర్తికానుంది. ఫిబ్రవరిలో సహకార సంఘాల పదవీకాలం ముగిసి పోనుంది. వీటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తే మునిసి పల్ కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు కూడా ద్వితీయ శ్రేణి నేతలకు దక్కనున్నాయి. అలా గే సహకార సంఘం ఎన్నికల్లో



- జులైలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ప్రాతిపదికనే అవకాశాలన్న సీఎం
- జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ కమిటీలపై ఆశలు
- ప్రతిపక్ష నేతల్లోనూ హుషారు
- ఉమ్మడి జిల్లాలో 2,567 మందికి స్థానిక పదవులు

జిల్లా	సర్పంచులు	ఎంపీటీసీ	జడ్పీటీసీ
వరంగల్	323	134	11
హనుమకొండ	208	129	12
భూపాలపల్లి	241	117	12
ములుగు	174	87	09
మహ-బాద్	461	198	18
జనగామ	281	140	12
మొత్తం	1,688	805	74

నామినేటెడ్ పదవులు.. ఇందిరమ్మ కమిటీలు

డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెట్టింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురికి వివిధ స్థాయిలో కార్పొరేషన్ పదవులు లభించాయి. అయితే జిల్లా స్థాయి, వ్యవసాయ కమిటీలు, ఆలయ కమిటీలను నియమించాల్సి ఉంది. వీటన్నింటిని కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత నియ మిస్తామని సీఎం ప్రకటిం చటంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపి నట్లైంది. అలాగే ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు, వాలంటీర్ల నియామకం చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. దీంతో ప్రతి గ్రామం నుంచి పది మం దికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇం దిరమ్మ కమిటీలు, వలంటీర్ల పదవులు లభించే అవకాశం ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసిన తీరును బట్టే పదవులు ఇస్తామని సీఎం కాంగ్రెస్ కార్యకర్తలకు లింకు పెట్టడంతో ఎంపీ అభ్యర్థుల గెలుపునకు శ్రమించక తప్పని పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరు గుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా వరం గల్ లోక్‌సభ స్థానం నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ స్థానం నుంచి బలరాంనాయక్ పోటీ చేస్తున్నారు. దీంతో వీరి గెలుపు బాధ్యతలను సీఎం పరోక్షంగా కార్యకర్తలపై భుజస్కంధాలపై పెట్టారన్న చర్చ జరుగుతోంది.

గెలిచిన డైరెక్టర్లకు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు అవకాశాలు రానున్నాయి.అలాగే పీఏసీఎస్ చైర్మన్ల నుంచి డీసీసీబీ డైరెక్టర్‌గా, చైర్మన్‌గా, ఓడీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్ లాంటి పదవులు జిల్లా స్థాయి నేతలకు లభించనున్నాయి. సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తరువాత మునిసిపాలిటీ, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించి మార్చి వరకు అన్ని రకాల ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఆ తరువాత నుంచి పరిపాలనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. కాగా, లోక్‌సభ ఎన్నికల

మిగతా 7వ పేజీలో..

మేడిగడ్డ బ్యారేజీ బ్లాకుల్లో టెస్టులు

- సన్నాహాలు చేస్తున్న నిర్మాణ సంస్థ!
- 7బ్లాకుల్లో ఇప్పటికే పూర్తి, 6,7వ బ్లాకుల్లో పాక్షికం
- 1 నుంచి 5వ బ్లాకుల్లో చేపట్టేందుకు సన్నద్ధం
- యంత్రాలు తరలించే వాహనాల కోసం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు



మేడిగడ్డ బ్యారేజీకి దిగువన గోదావరి నదిలో ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 13 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ మొదటి ఐదు బ్లాకుల్లో ఎలక్ట్రో రెసిస్టీవిటీ టెస్ట్ (ఈఆర్‌టీ), జియో ఫిజికల్ రాడార్ (జీపీఆర్) టెస్టులు చేసేందుకు నిర్మాణ సంస్థ సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. గత ఏడాది అక్టోబరు 21న బ్యారేజీ 7వ బ్లాకులోని 20వ పిల్లరుతోపాటు 18,19,21 పిల్లర్లు కుంగుబాటుకు గురికాగా అప్పటి నుంచి అందుకు కారణాలను అటు ఇంజనీర్లు, ఇటు నిర్మాణ సంస్థ అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలో కుంగుబాటుకు గురైన 20వ పిల్లరుతో పాటు 7వ బ్లాకులోని మిగతా పిల్లర్లు, ఏడో బ్లాకుకు ఇరువైపులా ఉన్న 6,8వ బ్లాకుల్లో ఈఆర్‌టీ, జీపీఆర్ టెస్టులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే.. ఇప్పటికే 7వ బ్లాకులో టెస్టులు పూర్తిచేసిన నిర్మాణ సంస్థ ఆ రిపోర్టులను ప్రభుత్వానికి నివేదించింది. 6వ, 8వ బ్లాకుల్లో ఈఆర్‌టీ టెస్టులు పూర్తి చేయగా జీపీఆర్ టెస్టులు కొనసాగుతున్నట్లు ఓ అధికారి తెలిపారు.

ముందస్తు చర్యల్లో భాగంగానే..

మరో రెండు రోజుల్లో 6వ, 8వ బ్లాకుల్లో జీపీఆర్ టెస్టులు పూర్తి కానున్న నేపథ్యంలో బ్యారేజీలోని మిగతా బ్లాకుల్లోనూ చేయాలని నిర్మాణ సంస్థ భావించినట్లు సమాచారం. బ్యారేజీలో మొత్తం ఎనిమిది బ్లాకులు ఉండగా మిగతా ఐదు బ్లాకుల్లో కూడా టెస్టులు పూర్తి చేస్తే ఓ అవగాహన రావచ్చనే ఆలోచనతో సిద్ధమైనట్లు తెలిసింది. దెబ్బతిన్న 7వ బ్లాకుతో పాటు 6వ, 8వ బ్లాకుల్లో టెస్టులు మాత్రమే చేయాలని ప్రభుత్వం సూచించినప్పటికీ మిగతా బ్లాకుల్లోనూ వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేస్తే భవిష్యత్‌లో ఇక వాటి అవసరం ఉండబోదని భావిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే బ్యారేజీలోని 1వ బ్లాకు నుంయి 5వ బ్లాకు వరకు టెస్టులు చేసే యంత్రాలు, వాహనాలు తిరిగేందుకు వీలుగా బ్యారేజీకి ఎగువన, దిగువ భాగాల్లో అప్రోచ్ రోడ్లను నిర్మించనున్నట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

వరదను తట్టుకొనేలా..?

బ్యారేజీలో కుంగుబాటుకు గురైన 7వ బ్లాకులో సీపేజీ సమస్యకు అడ్డుకట్ట వేసేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఇంజనీరింగ్ అధికారులకు సూచించినట్లు తెలిసింది. మరో రెండు నెలల్లో వానాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో వరదల సమయంలో నీటిని నిల్వ చేస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న దృష్ట్యా నీటిని దిగువకు వెళ్లేలా గేట్లు తెరిచే ఉంచాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. అయితే గేట్లు తెరిచి ఉంచినప్పటికీ సీపేజీ వల్ల పిల్లర్ల కుంగుబాటు మరింత విస్తరించే అవకాశం ఉన్న దృష్ట్యా ఆ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో సీపేజీ నివారణకు సంబంధించి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిసింది.

వడ్డీ వ్యాపారి ఇంట్లో పోలీసుల సోదాలు



వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేస్తున్న ఏఎస్పీ

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 13: వడ్డీ వ్యాపారి ఇంటిపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. లైసెన్సులు లేకుండా వడ్డీ వ్యాపారి చేస్తున్న మండల కేంద్రానికి చెందిన భూక్య సునీత ఇంట్లో ఏఎస్పీ మహేష్ గితే నేతృత్వంలో సోదాలు చేశారు. రూ.4,57,410తో పాటు ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, చెక్కులు, భూ పత్రాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రెండు ఇళ్లల్లో చోరీ

రేగొండ, ఏప్రిల్ 13: మండలంలోని మడ్తపల్లిలో దొంగలు శుక్రవారం రాత్రి బీభత్సం సృష్టించారు. వరుసగా రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మడ్తపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల సంతోష్ తన తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి గ్రామ శివారులోని కిరాణా షాపులో నిద్రపోయారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 30 వేలతోపాటు అర తులం బంగారం అపహరించారు. అదే గ్రామంలో కొయ్యడ సంజీవ్ ఇంట్లో చొరబడి రూ. 5 వేల నగదుతోపాటు బంగారు మాటీలు దొంగలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్సై రవి కుమార్ తెలిపారు.

గుప్త నిధుల ముఠా నుంచి విగ్రహాల స్వాధీనం

ఏడుగురిపై కేసు నమోదు



గుప్త నిధుల ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

చిట్యాల, ఏప్రిల్ 13: గుప్త నిధుల తవ్వకాలు మండలంలో ఇటీవల కలకలం సృష్టించిన నేపథ్యంలో వరికోలుపల్లి పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి పురాతన విగ్రహాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. వరికోల్‌పల్లికి చెందిన వంగల రమేష్, గోవిందుల రాజయ్య, వల్లపు జనార్దన్, గోవిందుల సదయ్య, చెక్క రమేష్, గుండబోయిన సదయ్య, దామరశెట్టి వీరయ్యపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ఆ పార్టీలకు ఓటు అడిగే అర్హత లేదు

- ఏజెన్సీ వాసులను పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్
- కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్



వాజేడులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బలరాం నాయక్

వాజేడు, ఏప్రిల్ 13: ఏజెన్సీ ప్రాంత వాసుల సంక్షేమాన్ని పట్టించుకోని బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే అర్హత లేదని కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విమర్శించారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగుడెం డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి ఆయన మండలంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వాజేడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. పూసూరు-ముళ్లెకట్ల వంతెన నిర్మాణంలో కీలకంగా వ్యవహరించానన్నారు. భద్రాచలం నుంచి వాజేడు వరకు రెండు లేన్ల రహదారి నిర్మాణానికి కృషి చేశానన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని అన్నారు. ఎంపీ కవిత ఏజెన్సీ ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న మోడికుంట ప్రాజెక్టును పూర్తి చేయిస్తానని, నర్సింగ్, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. పారాగన్ చెప్పుల కంపెనీని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తానన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేయటమే లక్ష్యంగా పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

పొదెం వీరయ్య మాట్లాడుతూ తనను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించడం బాధ కలిగించిందని, మళ్లీ ఆ తప్పు పార్లమెంటు ఎన్నికల్లో చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించి రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. పార్టీలోకి ఎవరూ వచ్చిన పర్వాలేదన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి కష్టపడ్డ నాయకులను గుర్తించి గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లె డెనార్జునరావు, నాయకులు నల్లాపు దుర్గాప్రసాద్, రసూల్, యశోద రాంబాబు, మురహరి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా...

వెంకటాపురం(నూగూరు) : తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఈప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు సయ్యద్‌హుస్సేన్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. వాజేడు మండలంలో గోదావరినదిపై వంతెన నిర్మాణం, రోడ్ల నిర్మాణం, పాలెం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరిగాయని అన్నారు. తన విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లపు దుర్గాప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు సత్యనారాయణ, పాయం రమణ, చిడెం మోహన్‌రావు, చింతిరాల రవి, శ్రీనివాస్, మన్నెం సునీల్, చిడెం శివ, కొండపర్తి సీతాదేవి, గార్లపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డగా ఆశీర్వదించండి

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న కడియం కావ్య

చిట్యాల, ఏప్రిల్ 13: తనను ఆడబిడ్డగా ఆశీర్వదించి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియ కావ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని జూకల్‌లో ఓ ఫంక్షన్‌హాల్ వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా కడియం ఫౌండేషన్‌ను నిర్వహిస్తూ దాని ద్వారా ఎంతో మంది నిరుపేదలకు చేయూతనిస్తున్నామన్నారు. ఎంపీగా గెలిపించుకుంటే అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడతానని హామీ ఇచ్చారు. తెలంగాణలో 14 కాంగ్రెస్ ఎంపీ సీట్లు గెలిపించి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి కానుకగా ఇద్దామన్నారు. బీజేపీని ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. మతతత్వమే ప్రధాన ఏజెండాగా పనిచేసే ఆ పార్టీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సైనికుల్లా పనిచేసి పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జాతీయ కార్యదర్శి కత్తి వెంకటస్వామి, నాయకులు నరసింహారెడ్డి, సాయిలు, మధు వంశీకృష్ణ, శ్రీదేవి, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



పట్టుబడిన వాహనాలతో పోలీసు అధికారులు

మహదేవపూర్, ఏప్రిల్ 13: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో శనివారం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. నంబరు ప్లేటు లేని, సరైన పత్రాలు లేని మూడు ఆటోలు సహా 60 బైకులను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత పత్రాలు చూపించాకే వాహనాలను తీసుకెళ్లాలని తేల్చి చెప్పారు. పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు. అనుమానాస్పదంగా ఉన్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దన్నారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సై ప్రసాద్, కాటారం ఎస్సై అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ అధ్యక్షుల పాత్ర కీలకం

బీజేపీని మళ్లీ అధికారంలోకి తేవాలి

కర్ణాటక ఎమ్మెల్యే అభయ్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్యే అభయ్ పాటిల్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 13: బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని, ఇందులో బూత్ అధ్యక్షుల పాత్ర కీలకమని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్ అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని బూత్ అధ్యక్షులతో ఆయన విజయసంకల్ప సభ నిర్వహించారు. మహబూబాబాద్‌లోని బాలాజీగార్డెన్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి బూత్‌లోనూ 370 కంటే ఎక్కువ ఓట్లు బీజేపీ పోలయ్యేలా కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 12 ఎంపీ స్థానాలను తప్పక బీజేపీ గెలుచుకుంటుందని, అందులో మహబూబాబాద్ ఎంపీ సీటు ఒకటని చెప్పారు.

త్వరలో భద్రాచలానికి మోదీ..

ప్రధాని మోదీ త్వరలోనే భద్రాచలానికి వచ్చే అవకాశం ఉందని అభయ్ పాటిల్ తెలిపారు. ములుగు జిల్లాలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. గిరిజన జిల్లా మానుకోటలో శ్రీసంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతికి కూడా జాతీయ హోదా కల్పిస్తామన్నారు.

బీజేపీ మహబూబాబాద్ ఎంపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ దేశంలో మోదీ ఆధ్వర్యంలో నిశబ్ద విప్లవం వచ్చిందన్నారు. మూడోసారి ఆయన్నే ప్రధాని చేయాలన్నారు. తమ అమూల్యమైన ఓటును వేసి తనను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి మునుగు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభారి వెంకటనారాయణరెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ సింగారపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మ పంచకూటాలయాన్ని పునర్నిర్మించాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 13: కాకతీయరాజులు రామప్ప గుడి సమీపంలోని రామానుజపురంలో నిర్మించిన ఎరుకల నాంచారమ్మ పంచకూ టాలయం శిథిలావస్థలో ఉందని, దాన్ని పునర్‌నిర్మించాలని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ఎరుకల సమాజం అభివృద్ధి కోసం రూ.500కోట్లు ఎరుకల కార్పొరేషన్‌కు కేటాయించి విద్యావంతుడైన ఎరుకల కులస్తుడినే చైర్మన్‌గా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆదివాసీ, గిరిజన తెగల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు

ఈసమావేశంలో ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మద్దిల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు బూనాద్రి రంజిత్‌కుమార్, బిజిలి ప్రశాంత్, దుగ్యాల రమేష్, పులిచేరు రవీందర్, పులిచేరు చంద్రయ్య, లోకిని చందర్, మానుపాటి సురేందర్, పులిచేరు చిన్న సారయ్య, పల్లకొండ ప్రభాకర్, ఓని సదానందం, కేతిరి రాజు, కుతాడి శ్రీనివాస్, రేవెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అగ్గి అంటుకుంటే బుగ్గే..

- నగరంలో విరివిగా అగ్ని ప్రమాదాలు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- కమర్షియల్ కాంప్లెక్సుల్లో ఫైర్‌సేఫ్టీ నిల్
- ఎన్‌వోసీలు తీసుకున్న దాఖలాలు లేవు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అగ్గి అంటుకుంటే బుగ్గే అనే పరిస్థితి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో కేవలం పదమూడుమాత్రమే ఫైర్ స్టేషన్‌లున్నాయి. వరంగల్ నగరంలో కేవలం రెండు స్టేషన్‌లు మాత్రమే ఉండటం విశేషం. నగర విస్తీర్ణంతో పాటు వ్యాపార సముదాయ భవనాలు, విద్యాకేంద్రాలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాల సంఖ్య వేగంగా పెరుగుతున్నప్పటికీ ఫైర్‌స్టేషన్‌ల సంఖ్య పెరగలేదు. ఏజెన్సీ ఏరియాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఇక అంతే సంగతులు, ములుగులో ఉన్న స్టేషన్‌నుంచి వాహనం వెళ్లేలోగా జరిగే నష్టం జరిగి తీరుతుంది. ఏటూరునాగారం ఏరియాలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ పాలకులు దృష్టి సారించకపోవడం గమనార్హం. నియోజకవర్గ కేంద్రాలకే ఫైర్‌స్టేషన్‌లు పరిమితం కావడంతో ఫలితం లేకుండా పోతోంది. వరంగల్ నగరం మినహా ప్రతీ నియోజకవర్గ విస్తీర్ణం ఎటూ 50 కిలోమీటర్లకు పైగానే ఉంటుంది. ఇలా స్టేషన్‌ల సంఖ్య పెంచకపోవడం, పాత వాహనాలు, అరకొర సిబ్బంది ఉండటంతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండటం విశేషం. ఈక్రమంలో ఆదివారం నుంచి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంది.

నిబంధనలకు నీళ్లు

వరంగల్ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు విరివిగా జరుగుతున్నాయి. వరంగల్ నగరంలో వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థల భవనాలు, ఆస్పత్రుల భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న వారు నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. ప్రతీ వ్యాపార సముదాయాల్లో ఫైర్ వాహనం తిరిగేలా స్థలం, ఫైర్‌సేఫ్టీ పరికరాలు, ఎమర్జెన్సీ ద్వారాలు ఇలా ఏర్పాట్లు తప్పనిసరి. అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలి. ఇలాంటి సౌకర్యాలులేని భవనాలే ఎక్కువగా నగరంలో ఉన్నాయి. అధికారుల చేతులు తడుపుతున్న వ్యాపారులు నిబంధనలు బుట్టదాఖలు చేస్తూ అనుమతులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అందినంత దండుకుంటున్న అధికారులు తనిఖీలు చేసిన పాపానపోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇటీవల వరంగల్‌లో జకోటియా కాంప్లెక్సులో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటన, గతంలో హనుమకొండలో జుబేర్ బుక్ స్టాల్, కల్యాణలక్ష్మీ సారీ సెంటర్‌లో, కరీంనగర్ రోడ్డులోని ఒక పెట్రోల్ పంపులో జరిగిన సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ సంఘటనల్లో మూడురోజుల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తే కానీ మంటలు నియంత్రించలేని పరిస్థితి ఏర్పడింది. ముందస్తు చర్యలు లేకపోవడం వల్లనే అగ్ని ప్రమాదాలు నిలువరించలేని దుస్థితి ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. వారోత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాకుండా వ్యాపార సముదాయాల్లో నిత్యం తనిఖీలు చేస్తూ నిబంధనలు కఠినతరం చేయాల్సి ఉంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

మామిడి భగవాన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్, వరంగల్




ముందస్తు చర్యలతో అగ్ని ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చు. వ్యాపార సముదాయాలు నిర్మించేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఫైర్ సెఫ్టీ చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి. జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 8712699304, 8712699305 నంబర్లకు సమాచారం అందించాలి. ఆదివారం నుంచి వారంపాటు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్

అర్హత సాధిస్తేనే పదోన్నతులు

ప్రత్యేక పరీక్ష నిర్వహించాలంటున్న టీచర్లు



జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పాసైతేనే పదోన్నతులకు అర్హులని ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) కొత్త నిబంధనలు విధించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన తాము ప్రస్తుతం పదోన్నతులు పొందేందుకు టెట్ తప్పనిసరి పాస్ కావాలనే నిబంధన పెట్టడం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టెట్ అర్హత సాధించడం ఇప్పుడు సాధ్యమయ్యే పని కాదని, తమ కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాగా రాష్ట్ర విద్యాశాఖ మాత్రం డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతో పాటే ప్రస్తుత ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాల్సిందేనని అంటోంది. ఏప్రిల్ నెలలో టెట్ నిర్వహించిన తర్వాతే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఉంటాయని పేర్కొంటోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

టెట్ నిర్వహణ ఇలా..

టెట్‌ను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పూర్తి పేపరు 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీలు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీలు 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. పేపర్ - 1 ఉత్తీర్ణత కావాలంటే చైల్డ్ డెవలప్‌మెంట్, తెలుగు, ఇంగ్లీషు, గణితం, పర్యావరణానికి సంబంధించిన అంశాలుంటాయి. పేపర్ - 2 లో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ అంశాలన్నీ చదవడం ఇబ్బందికరమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత ఉండాలని చెబుతుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో అవన్నీ తాము చదవలేమని, తమకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

2009 లోనే టెట్ ఉత్తర్వులు

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అంటే 2009 లోనే ప్రభుత్వం టెట్ ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో కొత్తగా డీఎస్సీ రాయాలనుకునేవారికి టెట్ నిర్వహించింది. కాని ఇన్‌సర్వీస్‌లో ఉన్నవారు కూడా టెట్ రాయాలని చెప్పలేదు. ఆ తరువాత 2013 లోనూ, 2015 లోనూ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టింది. ఈ పదోన్నతుల్లో వారికి టెట్ మినహాయింపు ఇచ్చింది. అంతెందుకు ఇటీవల జరిగిన మల్టిజోన్ స్థాయి బదిలీల్లో కూడా టెట్ కు ప్రాధాన్యత కల్పించలేదు. మల్టిజోన్-1 లో జరిగిన బదిలీలు పొందిన వారికి టెట్ అడగలేదు. ఇతర కారణాల చేత మల్టిజోన్-2 లో బదిలీలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మల్టిజోన్-2 లో బదిలీలు పొందేవారు కూడా టెట్ రాయాలనడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని యాజమాన్యాలలో కలిపి 2500 మంది ఉపాధ్యాయులున్నారు. వీరిలో దాదాపు 2000 మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత లేనివారే.

హేతుబద్ధత ఏది?

అసలు టెట్ నిర్వహణకు హేతుబద్ధత లేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఉపాధ్యాయ ఉద్యోగానికి డీఎస్సీ రాస్తే సరిపోతుందని, డీఎస్సీకి అర్హులైతే చాలని, ఉద్యోగార్హతకు, డీఎస్సీకి మధ్య ఈ టెట్ హేతురహితమని అంటున్నారు. ఎక్కడా లేని విధంగా టెట్ అర్హతకు ఓసీ, బీసీ, ఎస్సీలకు రకరకాల మార్కులను నిర్ణయించడం సరికాదని చెబుతున్నారు. కాగా పీఎస్ హెచ్‌ఎంలు ప్రైమరీ స్కూళ్లలో బోధిస్తారని, విధులు మాత్రం ఎస్‌జీటీ స్థాయిలో ఉంటాయని, అటువంటి వారు లెవెల్-1 పరీక్ష రాయాలా, లెవెల్-2 పరీక్ష రాయాలా అనేది ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని అంటున్నారు. పండిట్ టీచర్లు పేపర్-1 కానీ పేపర్-2 కానీ రాయలేరని, ఎందుకంటే వారికి సంబంధించిన సిలబస్ ఆ పేపర్లలో ఉండదని, వారికి ప్రత్యేకమైన ప్రశ్నాపత్రం ఉండాలని, అలాంటి వారు పదోన్నతులు పొందాలంటే ఎలా అనేదానికి విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి..

దొమ్మాట శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం టెట్‌కు సమాయత్తమవుతున్న వారితో పోటీపడి పరీక్ష రాసే పరిస్థితులు కల్పించొద్దు. టెట్ నిర్వహణ హేతురహితంగా ఉంది. పీఎస్‌హెచ్‌ఎంలు, పీజీ హెచ్‌ఎంలు, పండిట్లు ఏ పరీక్ష రాయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తప్పనిసరి పరిస్థితుల్లో టెట్ నిబంధన అమలు చేస్తే 2010 తరువాత నియామకమైన ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి.

కేడర్‌లో.. లోకల్ జోష్

5వ పేజీ తరువాయి

తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రావటంతో క్యాడర్‌ను పదవులు ఊరిస్తున్నాయి.

ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం..

లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఫైట్ ఉంటుందని సీఎం ప్రకటించటంతో ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతం వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు దీటుగా కాంగ్రెస్ జడ్పీటీసీలు, ఎంపీ టీసీ లు విజయం సాధించారు. చాలా చోట్ల బీజేపీకి చెందిన సర్పంచులు, ఎంపీ టీసీలు కూడా గత ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే ఉమ్మడి వరం గల్‌లోని ఆరు జడ్పీ ఛైర్మన్లు కూడా బీఆర్‌ఎస్ పరిధిలోనే ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవటంతో నేతలు, కార్యకర్తలు వలస బాట పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా బలపడుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో తమ అభ్యర్థి గెలిస్తే, లోకల్ బాడీ ఎన్నికల్లో తమకు అవకాశం లభిస్తుందనే ఆశతో ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారు. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనపై కాంగ్రెస్ క్యాడర్‌తో పాటు ప్రతిపక్షాల కార్యకర్తలు కూడా జోష్‌లో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

మార్కెట్లో వేలంలో మారిన సమయపాలన

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 13: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇబ్బంది పడకుండా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం నుంచి జూన్ 15 వరకు వేలం పాటల సమయాలలో మార్పులు చేసినట్లు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మార్కెట్లో మిర్చి బీటు ఉదయం 7.05 గంటలకు, పత్తి బీటు 8.05 గంటలకు, పల్లికాయ బీటు 8.15గంటలకు, పసుపు బీటు 8.30 గంటలకు, అపరాల బీటు 8.45 గంటలకు మారినట్లు తెలిపింది. అలాగే ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు ప్రతీ బుధవారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది. రైతులు, కార్మికులు, అడ్తి, ఖరీదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరింది.

17 నుంచి ఉచిత కోచింగ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి నిర్వహించేకామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటీ)లో ఎంఎస్సీ కెమిస్ట్రీ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల రసాయన శాస్త్రత విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ (బ్లెండెడ్ విధానం)లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, కేడీసీ రసాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.రమేశ్ తెలిపారు. ఉచిత శిక్షణ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభం అవుతుందని, 60రోజులపాటు జరుగుతోందని తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఏ కళాశాలకు చెందిన వారైన ఉచిత శిక్షణకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 98669-62589 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

21న జిల్లాస్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 13: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన అండర్-17 ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బాలబాలికల చెస్ పోటీలను టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ ప్రతినిధి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా 1 జనవరి 2017లోపు జన్మించిన 7ఏళ్ల బాలబాలికలు ఈ చెస్‌పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం బెల్టు షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.24వేల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో రూ.6760, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లిలో రూ.7360, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కంపేటలో రూ.5140, అగ్రంపహాడ్‌లో రూ.4560 విలువ కలిగిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

శ్రీపాదరావుకు ఘన నివాళి



కొయ్యూర్‌లో శ్రీపాదరావు వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 13: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని మహదేవపూర్, కాటారం, పలిమెల మండలాల వ్యాప్తంగా శనివారం నిర్వహిం చారు. కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీపాదరావు గ్రంథాలయ చైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా, శాసన సభ స్పీకర్‌గా ప్రాతినిధ్యం వహించి ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన చొరవతో మారుమూల గ్రామాలకు విద్యుత్, రోడ్డు సౌకర్యాలు సమకూరాయన్నారు. ఈకార్యక్రమంలో కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, వేంనూరి ప్రభాకర్ రెడ్డి, చీమల సందీప్, కొట్టె శ్రీశైలం,శశికుమార్, సీనియర్ నాయకులు దబ్బెట రాజేష్, నవీన్ రావు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మల్హర్ : మండలంలోని కొయ్యూర్‌లో శనివారం మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 25వ వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించాయి. ఈ సందర్భంగా కొయ్యూర్ చౌరస్తాలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎంపీటీసీ ప్రకాశ్‌రావు, డైరెక్టర్ మొండయ్య, నాయకులు కొండ రాజమ్మ, మమత, రాజునాయక్, మధు, ప్రభాకర్, సమ్మయ్య, ఆంజనేయులు, రాజునాయక్, సది, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్: దివంగత శాసన సభా స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని మండలంలోని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు కాళేశ్వరం, అన్నారం తదతర గ్రామాల్లో శ్రీపాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, జడ్పీటీసీ అరుణ, ఎంపీపీ రాణిబాయి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



కలికోటపల్లిలో మానేరు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

టేకుమట్ల, ఏప్రిల్ 13: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. మండలంలోని చలివాగు, మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న కళికోట, బూర్నపల్లి ప్రాంతాలను ఆయన శనివారం పరిశీలించారు. మానేరు, చలివాగుల నుంచి ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అన్నారు. పోలీసుల ఆదేశాలను ధిక్కరిస్తే జైలుకు పంపిస్తామని, అయినా ప్రవర్తనను మార్చుకోకపోతే పీడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. కేసుల పురోగతి, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సంఘ విద్రోహశక్తులపై నిఘా ఉంచాలని, తరచూ వాహనాల తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్, ఎస్సై ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రేగొండ, ఏప్రిల్ 13: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాగిర్తిపేట క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని వ్యాను ఢీకొంది. దీంతో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా బాంబ్రాఘాట్ మండలం శోభానగర్‌కు చెందిన లాల్స్‌వాలే తిలామి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో అతడే శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య మాధురిలాల్ తిలామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఏటూరునాగారం, ఏప్రిల్ 13: అంబేద్కర్ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శనివారం ఘనంగా జరి గాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ వాది పల్లె నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయా లను సాధించుకోవాల న్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. విద్యా ర్జన ద్వారానే బడుగు బలహీన వర్గాల జీవితాలు బాగుపడుతాయని అంబేద్కర్ భావించేవారన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర రాజన్న, పోరిక శంకర్, పబ్బు వెంకటేశ్వర్లు, అక్బర్ పాషా, చాట్ల రవి, తొంగల వెంకటేశ్వర్లు, పోరిక రాజు కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ఏటూరునాగారం రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె. చిన్నా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని దేశానికి అందించారని, స్వయంకృషితో ఎన్నో కష్టాలను ఎదిగమించి ఉన్నత స్థానాలకు ఎదిగారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. రవీందర్, అధ్యాపకులు ఘన్‌సింగ్, రమేష్‌కుమార్, నవీన్, జ్యోతి, సంగీత, సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి



గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహదేవపూర్, ఏప్రిల్ 13: మండలంలోని కాళేశ్వరంలో సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు శనివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమ గోదావరిలో స్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలు, వత్తులు వెలిగించి గోదావరిలో వదిలారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

హామీలు విస్మరించిన ప్రధాని : సీపీఎం

కాకతీయఖని, ఏప్రిల్ 13: దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రధాని నరేంద్రమోదీ విస్మరించారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. నల్లధనం రాబట్టి ప్రతి ఒక్కరి అకౌంటులో రూ. 15లక్షలు వేస్తానని చెప్పి మాట తప్పాడని పేర్కొన్నారు. ప్రధాని అనుసరించిన విధానాలను ఎండగట్టాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని కోరారు.

పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

● జడ్పీ సీఈవో విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీసీఈవో విజయలక్ష్మి

చిట్యాల, ఏప్రిల్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలను కల్పించేపనులను వెంటనే ప్రారంభించాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కన్వీనర్, పలు శాఖల అధికారులతో ఆమె శనివారం సమావేశమై పలు అంశాలను సమీక్షించారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలతోపాటు తరగతి గదుల మరమ్మతు పనులను మహిళా సంఘాల సభ్యులు వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయశ్రీ, ఎంఈవో రఘుపతి, ఎంపీవో రామకృష్ణ, ఏఈ అనీల్‌కుమార్, నోడల్ ఆఫీసర్ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కొలతలు పాటించాలి : ఎంపీడీవో

గణపురం, ఏప్రిల్ 13: ఉపాధిహామీ పనుల్లో నిర్ణీత కొలతలు పాటించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని గణపసముద్రం సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. నిర్ణీత కొలతలు పాటిస్తే రూ. 300 వరకు కూలి డబ్బులు జమ అవుతాయని తెలిపారు. అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా తీసుకోవచ్చని సూచించారు. పెండింగ్ బిల్లులు ఉంటే 15 రోజుల్లో తమ ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజు, టీఏ శ్రావణ్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలోని అమ్మ గార్డెన్‌లో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి అధికారం ఇస్తే సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ దాన్ని విస్మరించారని విమర్శించారు. నల్ల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నాలు చేస్తే బీజేపీ ప్రభుత్వం రైతుల ప్రాణాలు తీసిందన్నారు. ప్రజల సంక్షేమం జరగాలంటే నల్లధనం బయటకు రావాలంటూ నోట్ల రద్దు చేసిన బీజేపీ ప్రజా సంక్షేమం కోసం చేసిందేమీ లేదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్‌ను ఆ పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. కార్యకర్తలు గ్రామాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకొని సైనికుల్లా పని చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసే వారికి రాబోయే పంచాయతీ ఎన్నికల్లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. టేకుమట్ల మండలం నుంచి 10 వేల మెజారిటీ లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంటగూరి రాం నర్సింహరెడ్డి, అశోక్, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, జిల్లా కార్యదర్శులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, వైనాల రవీందర్, మండల ఉపాధ్యక్షుడు వోతే రాజమౌళి, మాదం కొమరయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తోడేటి కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లపల్లి గ్రామంలో పలు విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవం మూడు రోజులపాటు వైభవంగా జరిగింది. శనివారం భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మ, హనుమాన్ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్‌పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, వివిధపార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీగా గెలిపించండి

స్వతంత్ర అభ్యర్థి అక్కపాక తిరుపతి



విలేకరులతో మాట్లాడుతున్న తిరుపతి

మహదేవపూర్ రూరల్ (కాటా రం), ఏప్రిల్ 13 : పెద్దపల్లి ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతానని స్వతంత్ర ఎంపీ అభ్యర్థి అక్కపాక తిరుపతి కోరారు. కాటారం మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ మంథని నియోజవర్గ ఇన్‌చార్జి అందే భాస్కరాచారితో కలిసి ఆయన మాట్లాడారు. 2004 నుంచి గెలిచిన ఒక్క ఎంపీ కూడా ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడలేదని అన్నారు. మాదిగ సామాజిక వర్గం ప్రజల మద్దతు తనకు మెండుగా ఉందని అన్నారు. టీడీపీలో 20 ఏళ్లుగా పనిచేస్తూ వచ్చానన్నారు. ప్రస్తుతం తెలంగా ణలో టీడీపీ పోటీ చేయకూడదన్న నిర్ణయంతో తనకు పార్టీ బీఫాం ఇవ్వకున్నా కార్యక ర్తలు అభిప్రాయం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని తెలి పారు. విలేకరుల సమావేశంలో నాయకులు పోటు సుశీల, అందే సంధ్యరాణి, చీర్ల మల్లారెడ్డి, వెలుపుల సత్యనారాయణ, పోటు లత, కాసిపేట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెల మృతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 13 : విదుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన ఏటూరునాగారం మండలం ముల్లెకట్ట గ్రామంలో శనివారం జరిగింది. రోజూ లాగే ఉదయం గ్రా శివారులోని పొలాల్లోకి మేత కోసం వెళ్లిన అదే గ్రామానికి చెందిన దడిగే రామయ్య, చల్లకత్తి రాజుకు చెందిన రెండు పాడి గేదెలకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తాకాయి. దీంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మంద ప్రభాకర్‌ను కలిసిన బీసీ నేత సదానందం

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 13: హైదరాబాద్‌లోని బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌ను శనివారం జాతీయ బీసీ యువజన విభాగం రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు దయ్యాల సదానందం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ప్రభాకర్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన క్రమంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు.



ప్రభాకర్‌ను సత్కరిస్తున్న సదానందం

పాఠశాలకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయుల విజ్ఞప్తి

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 13: మండలంలోని లక్ష్మీదేవిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన ఆరుగుంటల భూమిని కొందరు ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేశారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాలకు రంజాన్ సెలవులు రావడంతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలకు తూర్పువైపున ఉన్న ప్రహరీని కూల్చివేసి ఆరుగుంటల భూమిని ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేశారని అంటున్నారు. ఈవిషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

వైభవంగా కోదండ రామాలయ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు

వాజేడు, ఏప్రిల్ 13: మండ లంలోని ధర్మవరంలో కోదండ రామాలయ ప్రతిష్ఠాపన శనివారం వైభవంగా జరిగింది. గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండ రామాలయంలో ధ్వజస్తం భం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం వేద పండితులు యంత్ర ప్రతిష్ఠ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమా లను నిర్వహించారు. అనంతరం కలాన్యాసం, హోమాలు, రుద్ర హోమం, నేత్రోన్మీలన, దిష్టిస్థాపన, కుంభ దర్శన, ధేను దర్శనాలు, జయాధులు, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. శ్రీ సీతారామచంద్రస్వామి వారి నూతన విగ్రహాలకు గోదావరి జలాలతో అభిషేకం చేసి ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయ పరిసరాలలో అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 13: అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. మండల పరిధిలోని సూరవీడు కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. గ్రామస్థులెవరూ అడవి జంతువుల కోసం ఉచ్చులు, కరెంటు తీగలు ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణం కావొద్దని సూచించారు. సైబర్ నేరాల బారిన పడొద్దని, బడీడు పిల్లలను బడికి పంపించాలని అన్నారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగించిన పోలీసులు

తాడ్వాయి, ఏప్రిల్ 13: ఈఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో పోగొట్టు కున్న సెల్‌ఫోన్లను బాధితులకు తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి శని వారం అప్పగించారు. మేడారం జాతరలో భక్తుల రద్దీ, ఒత్తిడి వల్ల దేవతల గద్దెల సమీపంలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శిం చి చోరీలకు పాల్పడ్డారని అన్నారు. కొంతమంది దొంగలు దొరకడంతో వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో భాగంగా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో బాధితుల పూర్తి ఆధారాలు సేకరించి సెల్‌ఫోన్లు అప్పగించినట్లు పేర్కొన్నారు. కాటారం గ్రామానికి చెందిన ఆవుల వెంకటేష్, తాడ్వాయి మండలం ఎల్బాకకు చెందిన జజ్జరి రాకేష్, మేడారానికి చెందిన మూడ్ గీత, నల్లబెల్లి మండలం లెంకలపల్లికి చెందిన ఎద్దు రామ్మూర్తికు సెల్‌ఫోన్లు అందించినట్లు తెలిపారు. జాతరలో ఇంకా ఎవరైనా వస్తువులు, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లయితే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై నారాయణ, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

శ్రీక్షేత్రం ఆలయంలో గోటి తలంబ్రాల తయారీ



గోటి తలంబ్రాలు తయారు చేస్తున్న భక్తులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 13: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ములుగులోని శ్రీసీతారామచంద్ర స్వామి (శ్రీక్షేత్రం) ఆలయంలో శని వారం గోటి తలంబ్రాల తయారీ కార్యక్రమం జరిగింది. ఆలయ కమి టీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో భక్తులు గోటి తలం బ్రాలు తయారు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా భక్తులు గోటితో వడ్లు ఒలిచి తలంబ్రాలను తయారు చేస్తున్నారు. నవమి వేడుకల కోసం ఈ కార్యక్రమం ఈనెల 16 వరకు కొనసాగుతుందని, మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు తోట రాధ, ఓదెల సరళ, శారద, లావణ్య, జెల్ల రజిత, కొత్తకొండ అశ్విత, తోకల స్వరూప, భవ్య, ఇమ్మడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వ్యాన్

వాజేడు, ఏప్రిల్ 13: లారీని వ్యాన్ ఢీకొన్న సంఘటన మండలంలోని 163వ జాతీయ రహదారి మండపాక వద్ద శనివారం చోటు చేసుకుంది. ఏటూరునాగారం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వ్యాన్‌ను ఢీకొంది. వ్యాన్ డ్రైవరు సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్ది సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

చలివేంద్రం ప్రారంభం

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 13: ములుగు పట్టణంలోని బండారు పల్లి రోడ్డులో గండ్రకోట సుధీర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు కాగా వ్యవస్థాపకులు గండ్రకోట సుధీర్ ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో వివిధ పనులను నిమిత్తం జిల్లాకేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇప్పటికే పట్టణంలో పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అందులో భాగంగానే బండారుపల్లి రోడ్డులో నూతనంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24గంటలపాటు చలివేంద్రం అందుబాటులో ఉంటుందని, జిల్లాకేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరూ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 13: ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి తగిన జా గ్రత్తలు తీసుకోవాలని సీఐ మేకల రంజిత్‌కుమార్ అన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆయన ములుగులోని అగ్నిమాపక కేంద్రంలో ఆవిష్కరిం చారు. 1944ఏప్రిల్ 14న ముంబా యిలోని విక్టోరియా రాక్‌యార్డ్ నౌకలో సంభవించిన అగ్నిప్రమాదంలో 66 మంది అగ్నిమాపక దళ సిబ్బంది కర్తవ్య విధి నిర్వహణలో అమరులయ్యారని అన్నారు. వారి స్మారకార్థం ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20వతేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి ఎమ్డీ.అబ్దుల్ రహీం, సిబ్బంది టి.నగేష్, మధుసూదన్, ఆర్.భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

పోడు కోసం అడవి నరికివేత

విచారణ చేపట్టిన ఫారెస్టు అధికారులు

మేడారం, ఏప్రిల్ 13: కొత్తగా పోడు సాగు కోసం గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో అడవిలోని కంకవనం నరికివేసిన సంఘటన తాడ్వాయి మండలం మేడారం రేంజ్ పరిధిలోని కాల్వపల్లి రోడ్ వద్ద చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించిన బీట్ అధికారి హుస్సేన్ పలువురిని విచారించారు. సుమారు ఎకరం స్థలంలో రూ. 10లక్షలకు పైగా విలువ చేసే కంకవనం ధ్వంసం కావడంతో నిందితులను గుర్తించేందుకు విచారణ చేపట్టారు.

బహుజనుల చైతన్యం కోసమే స్ఫూర్తి దీక్ష



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పుట్ట మధు

మహదేవపూర్, ఏప్రిల్ 13: బహుజనుల చైతన్యం కోసమే స్ఫూర్తి దీక్ష తీసుకున్నట్లు పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు తెలిపారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన శనివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. పూలే జయంతి సందర్భంగా ఈనెల 11న 16 మందితో స్ఫూర్తి దీక్ష తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, తగరం శంకర్ లాల్, పెండ్యాల మనోహర్, లింగాల రామయ్య, అలీంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని బెగ్లూర్ శివారు ప్రాంతంలోని నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి దాడిచేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మిరప కల్లాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 23,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మరికొందరు పరారయ్యారని తెలిపారు.